క్లుప్తంగా

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్ర, శనివారాల్లో స్థానిక కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక చెరువుకొమ్ముపాలెం శ్రీసరస్వతి జూనియర్ కాలేజీ ప్రాంగణంలో జరిగే శ్రీసరస్వతి విద్యాసంస్థల 33వ వార్షికోత్సవంలో పాల్గొంటారన్నారు. శనివారం 11గంటలకు రావినూతలలో సినీ నటుడు రఘుబాబు నివాసంలో జరిగే శుభ కార్యక్రమంలో పాల్గొంటారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీమకుర్తి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ కె.రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు అధికారులు పాల్గొనాలని తెలిపారు.

హరిహరక్షేత్రంలో గంగాళోత్సవం


గంగాళోత్సవంలో పాల్గొన్న శిద్దా లక్ష్మీపద్మావతి

చీమకుర్తి: ధనుర్మాసం పురస్కరించుకొని చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో గురువారం గంగాళోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ ట్రస్ట్ కమిటీ తరఫున మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గోదాదేవికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

బూచేపల్లి ఖరారుతో హర్షాతిరేకాలు


బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: దర్శి అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేరు ఖరారు కావడంతో చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో సందడి నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తూ బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు కూడా ఉన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, గోపురపు చంద్ర ఆధ్వర్యంలో పద్మశాలీయులు కేకును కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని దారం వారిపాలెంలో ఎట్రాసిటీ కేసులో దర్శి డీఎస్పీ అశోకవర్ధనరెడ్డి గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలోని నూతకోటి గోవిందమ్మకు చెందిన సర్వే నంబరు 102-1లో 2-20 ఎకరాల డీకే పట్టా భూమికి సంబంధించిన భూ వివాదంలో అదే గ్రామానికి చెందిన కుమ్మిత శివారెడ్డి, విజయ ప్రోద్బలంతో నూకతోటి రామయ్య, విజయనిర్మల, నూకతోటి చిన్నోడు, శ్రీలక్ష్మీలు పొలంలోకి వస్తే చంపుతామని బెదిరించడంతో వారిపై తాళ్లూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. వీరిలో కుమ్మిత శివారెడ్డి, విజయలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయగా కేసు విచారణలో భాగంగా భూమిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు. పూర్తి విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఏఎస్‌ఐ మోహనరావు, సిబ్బంది అంజిబాబు, కృష్ణయ్య ఉన్నారు.

మహిళల జీవనోపాధిపై ప్రత్యేక దృష్టి

మార్కాపురం: పట్టణ పరిధిలో మహిళలకు జీవనోపాధుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్పీలకు పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి సూచించారు. గురువారం మెప్మా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైయస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాలు లబ్ధిదారులకు అందించాలన్నారు. ఇల్లు కట్టుకునేవారికి బ్యాంకర్లతో మాట్లాడి రుణ సదుపాయం కల్పించాలని చెప్పారు. ఆహా క్యాంటీన్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఉపయోగించుకునేలా అనాథలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సిటీ మిషన్ మేనేజర్ ఎలీషా, సీఈఓ కటాక్షం, సంస్థాగత నిర్మాత స్పెషలిస్టు లక్ష్మణ్, హెల్త్ న్యూట్రీషన్ స్పెషలిస్టు కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

పేకాట, కోడిపందేలపై చర్యలు

కురిచేడు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎవరైనా కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ దేవకుమార్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పర్వదినాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్ర


ఒంగోలు రాజపానగల్‌రోడ్డు సచివాలయం, పేర్నమిట్ట ఇందిరానగర్ సచివాలయం జట్లు


మండల స్థాయిలో ఖోఖో, వాలీబాల్‌లో విజయం సాధించిన గమళ్ళపాలెం, వజ్జిరెడ్డిపాలెం క్రీడాకారులు


మద్దిపాడు: ఖోఖోలో తలపడుతున్న మద్దిపాడు లింగంగుంట యువతులు

కొత్తపట్నం: ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు మండల స్థాయిలో హోరాహోరీగా కొనసాగుతున్నాయి. గురువారం ఒంగోలు నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. గమళ్ళపాలెం పంచాయతీ, వజ్జిరెడ్డిపాలెం పంచాయతీల క్రీడాకారులు వాలీబాల్, ఖోఖో ఆటలో విన్నర్స్‌గా నిలిచారు. వాలీబాల్‌లో రాజుపాలెం సచివాయం క్రీడాకారులు రన్నర్‌గా, ఖోఖో ఆటలో అల్లూరు-2 సచివాలయం క్రీడాకారులు రన్నర్‌గా గెలిచారు. మహిళల విభాగంలో ఖోఖో విన్నర్‌గా మడనూరు-1 గ్రామ సచివాలయం, రన్నర్‌గా కొత్తపట్నం1, వాలీబాల్ విన్నర్‌గా కొత్తపట్నం-2, రన్నర్‌గా మడనూరు-1 విజయం సాధించారు. విన్నర్‌గా గెలిపొందిన టీంలను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత తెలిపారు. ఆటలను సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కొత్తపట్నం టీంలు మొదటి బహుమతులు సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ఎంతో మందిని ఆకట్టుకున్నాయన్నారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, పీడీలు బి.సాయికిషోర్, బి.భానుప్రతాప్, సీహెచ్ వెంకటేశ్వర్లు, బి.యశోధ, ఎస్.ఫైర్‌యాజ్, ఆదిత్య పవన్ పాల్గొన్నారు.

మద్దిపాడు: మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మండలంలోని 18 సచివాలయాలకు సంబంధించిన యువకుల యువతుల జట్లు క్రీడా స్ఫూర్తితో పోటాపోటీగా ఆడుతున్నాయి. మండలంలోని మూడు మైదానాల్లో మండల స్థాయి క్రీడా పోటీలు జరగ్గా అక్కడ గెలిచిన టీంలు మండల కేంద్రం మద్దిపాడులో ఫైనల్స్ ఆడుతున్నాయి. మండలం నుంచి గెలుపొందిన జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. క్రీడాపోటీలను సచివాలయ కార్యదర్శులు వలంటీర్లు, పీడీలు పర్యవేక్షించారు.

ఒంగోలు సబర్బన్: క్రీడలతో ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం ఏర్పడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం డాక్టర్ ఆనంద్ మినీ స్టేడియం, పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీల కార్యక్రమాల్లో పాల్గొని క్రీడా పోటీలను వీక్షించారు. సచివాలయాల మధ్య జరిగే క్రీడల వివరాలను సచివాలయ సిబ్బంది, పీఈటీలను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, ఇతర వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం శివప్రసాద్ కాలనీ సచివాలయం, బృందావన్ నగర్ సచివాలయం మధ్య జరిగిన క్రికెట్‌కు టాస్ వేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు బ్యాటింగ్ చేశారు. పీఈటీలు వెంకటేశ్వరరావు, సురేష్, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


ఖోఖో ఆడుతున్న కొత్తపట్నం మహిళలు


వాలీబాల్ ఆటను ఆడుతున్న గమళ్ళపాలెం, వజ్జిరెడ్డి పాలెం క్రీడాకారులు


బ్యాటింగ్ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

14న ముగ్గుల పోటీలు

ఒంగోలు టౌన్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈ నెల 14న నగరంలోని లాయరుపేటలో 35వ వార్డు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ దామా శ్రీనివాసులు, హరిబాబు లక్ష్మీనారాయణ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. లాయరుపేటలోని ముంగమూరు రోడ్డులో గల ఉమామహేశ్వర జూనియర్ కాలేజీ దగ్గర ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు ప్రారంభం అవుతాయని తెలిపారు. నగర స్థాయిలో జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ. 6000, రెండో బహుమతి రూ. 4000, మూడో బహుమతి రూ. 3000, నాలుగో బహుమతి రూ. 2000 ఇవ్వనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రంగుల ముగ్గులు మాత్రమే వేయాలని, ఎవరి రంగులు వారు తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490300354, 7032108263 నంబర్లను సంప్రదించాలన్నారు.

సెర్ప్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

ఒంగోలు టౌన్: సెర్ప్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం భోజన విరామ సమయంలో ప్రగతి భవన్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బి.గోపినాథ్, బీఎల్ సుబ్బారావు, సుభాషిణి, నరసింహులు, నారాయణ, రామారావు, ప్రసాద్, కృపారావు, కోటేశ్వరరావు, రమణయ్య పాల్గొన్నారు.

డాక్టర్ హేమంత్ కుమార్‌కు ఆత్మీయ సన్మానం


డాక్టర్ హేమంత్ కుమార్‌ను సన్మానిస్తున్న సుజాత, వైష్ణవి, శరత్‌కుమార్

కొత్తపట్నం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా పనిచేసిన హేమంత్ కుమార్ జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం హేమంత్ కుమార్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ కొత్తపట్నం పీహెచ్‌లో హేమంత్ కుమార్ తక్కువ సమయంలో పనిచేసి అనేక మంది రోగులకు వైద్య సేవలు, సలహాలు అందించి గొప్ప పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. చిన్న వయస్సులోనే జిల్లా ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్‌గా ఎంపిక కావడం ఎంతో అదృష్టమన్నారు. తను జీవితంలో ఇటువంటి పదవులు ఎన్నో ఆశించాలని కోరారు. డాక్టర్ వైష్ణవి మాట్లాడుతూ రోగులకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాడని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్ని కార్యక్రమాలు విజయవంతం చేసిన వారిలో హేమంత్ కుమార్ ఒక్కరన్నారు. యూడీసీ శరత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో హేమంత్‌కుమార్ చురుగ్గా పాల్గొని మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. అనంతరం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభంగా జరిగాయి. సీహెచ్ఓ ఓంకార్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన సంస్కృతిని ప్రతిబింబించిన ఫాతిమా


ఫాతిమా షేక్‌కు నివాళులర్పిస్తున్న బోఫ్, ప్రజాసంఘాలు

ఒంగోలు టౌన్: దేశంలో తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా బహుజన సంస్కృతిని చాటిన ఫాతిమా షేక్ జీవితం నేటి తరాలకు ఆదర్శనీయమని బహుజన ఉద్యోగుల సమాఖ్య (బోఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ సాలార్ అన్నారు. గురువారం మంచి పుస్తకం వద్ద బహుజన అధికారులు, ఉద్యోగుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 193వ జయంతి నిర్వహించారు. ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాలార్ ప్రసంగిస్తూ మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయితో కలిసి తొలి తరంలో మహిళల్లో విద్యాభివృద్ధి కోసం ఫాతిమా షేక్ పాటుపడ్డారని తెలిపారు. పూలే స్ఫూర్తితో మహిళలకు చదువు చెప్పడం, తొలి పాఠశాలలను ప్రారంభించడానికి అనేక అవమానాలను ఎదుర్కొన్నారన్నారు. ముస్లిం మహిళలు ఫాతిమా షేక్ స్ఫూర్తితో ఉన్నత చదువులు అభ్యసించి రాణించాలని పిలుపునిచ్చారు. నేడు దేశంలో ముస్లిలంను రెండో తరగతి పౌరులుగా చిత్రీకరించడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు చేస్తున్న దుష్ట ప్రయత్నాలను తిప్పి కొట్టడమే ఫాతిమా షేక్‌కు నిజమైన నివాళని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అన్నారు. చుండూరి రంగారావు, భీమవరపు సుబ్బారావు, షేక్ సత్తార్, ఎం. సూర్య కుమారి, మెగిలిదేవ ప్రసాద్, జెన రాజు, కొటారి జనార్దన, ఆవుల సుబ్రమణ్యం, జార్జి, పిన్నిక శ్రీను, దాసరి సుందరం తదితరులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి ఆదర్శనీయుడు


జిల్లా గ్రంథాలయంలో నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: దేశ అత్యున్నత పదవిలో ఉంటూ కూడా సామాన్యుడిలా నిరాడంబరంగా జీవించిన దివంగత ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి నేటి తరానికి ఆదర్శనీయుడని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో లాల్ బహదూర్ శాస్త్రీ 58వ వర్థంతి నిర్వహించారు. శాస్త్రీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేరయ్య మాట్లాడుతూ... స్వతంత్ర్య భారత దేశంలో రెండో ప్రధాన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన శాస్త్రి నిజాయితీగా వ్యవహరించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. 1965లో భారత్ పాకిస్థాన్ మధ్య జరిగిన యద్ధంలో జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని సమర శంఖంలా పూరించి దేశాన్ని విజయపథంలో నిలిపారని చెప్పారు. జెండాలు పట్టుకోవడం మాత్రమే దేశభక్తి కాదని, మనసా వాచా కర్మణా పంచేంద్రియాలు అంకితభావంతో దేవం కోసం అంకిత భావంతో పరితపించాలని నమ్మిన నిజమై దేశభక్తుడు శాస్త్రి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని చెప్పారు. ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, పి.ఇమ్మానుయేలు, కె.కృష్ణవేణి, యస్.అనిల బాబు, వై.మృదుల్ కుమార్, స్మైలీ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్, అతిథులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని సాధించటానికి కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సాయి బాబ సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు సాయినాథుని శరత్ బాబూజీ సతీమణి సాయినాథుని అనసూయమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ దినేష్ కుమార్, ఇస్రో సైంటిస్ట్, డైరెక్టర్ ఏ. రాజ రాజన్, డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ విజయ క్రిష్ణన్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు సందేశం అందించారు. ఇస్రో సైంటిస్ట్, డైరెక్టర్ ఏ. రాజ రాజన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యను ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరారు. అకడమిక్ డైరెక్టర్ శృతి సాయి నాథుని, కంట్రోలర్ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్, ఇస్రో ఎం. శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ బీఎస్ రెడ్డి, మేజర్ సురేష్, ఎలిస్ స్లాడర్‌లు పాల్గొని సందేశం విద్యార్థులకు అందించారు. కరస్పాండెంట్ జీవీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణ చట్టం అమలు చేయాలి


సూచనలు చేస్తున్న శివశంకర్

ఒంగోలు సెంట్రల్: పొగాకు నియంత్రణ చట్టం కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర పొగాకు నియంత్రణ లీగల్ అడ్వయిజర్ పి. శివశంకర్ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు పట్టణంలోని ముంగమూరు రోడ్డులో లా ఎన్‌ఫోర్స్‌మెంటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పాన్ షాపులు సందర్శించి ధూమపానం చేసేవారు పాటించాల్సిన నియమాల గురించి దుకాణదారులకు అవగాహన కల్పించారు. మైనర్లకు విక్రయించవద్దని, బహిరంగ ప్రదేశాల్లో ధూమ పానం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఎన్‌సీడీ పీఓ డాక్టర్ భగీరధి, డీసీఎం రాజేశ్వరి, ఎస్సై ప్రేమ్ కుమార్, డ్రగ్ కంట్రోలర్, వ్యవసాయ శాఖ, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంటు అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కండువా కప్పుకున్న సచివాలయ ఉద్యోగి

కంభం: తెలుగుదేశం పార్టీ కండువా వేసుకున్న సచివాలయ ఉద్యోగిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీవో ప్రసాద్‌బాబు తెలిపారు. మండలంలోనిని చిన్నకంభం సచివాలయంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ కరిముల్లా బుధవారం సాయంత్రం గిద్దలూరులో టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా టీడీపీ కండువా వేసుకుని ఆ పార్టీలో చేరాడు. ఆ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చెప్పారు.

ఉద్యోగావకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు

- ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందుకు మరో కీలకమైన ముందడుగు వేసిందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ వెబ్‌సైట్ పోర్టల్‌ను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాల సమాచారం తెలుసుకుని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఆన్‌లైన్ పోర్టల్ విధానం నిరుద్యోగ యువతకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. పదో తరగతి నుంచి ఏ విద్యార్హత కలిగిన వారైన ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా వారి అర్హతలుకు తగిన ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు.

ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్, ఎంబీఏ, డిగ్రీ కోర్సులతో పాటు ఐటీ, టెక్నికల్‌రంగాలకు యువత ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో వారి అవసరాలకు తగినట్లు ఎంప్లాయిమెంట్ వెబ్‌పోర్టల్ రూపొందించడం శుభపరిణామమన్నారు. పూర్తి వివరాలకు 08592-281776 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు స్వామి వివేకానంద జయంతి

ఒంగోలు: స్వామి వివేకానంద 161వ జయంతిని శుక్రవారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సంక్షేమశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పమాలంకరణలో కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

మార్కాపురం టౌన్: మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా బి.నాగేశ్వరరావును నియమించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నందం శేఖర్ తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను నియమించినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా రామయ్య, కమిటీ ప్రతినిధులుగా రంగయ్య, అచ్యుతరావు, జీవరాజు, అబ్బన్న తదితరులు నియమించినట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు అర్బన్: ఈ నెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నగర మేయర్ గంగాడ సుజాత కోరారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బాబా సాహెబ్ జీవిత చరిత్రను తెలిపేలా ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గురువారం సందర్శించారు. సామాజిక న్యాయం, మహిళా అభ్యుదయం కోసం కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన విగ్రహాన్ని పండుగ వాతావరణంలో సీఎం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మాధవి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్ ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ భగవాన్ పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా సెక్రటరీ వరకుమార్, ట్రెజరర్ విజయభాను, అసోసియేట్ ప్రెసిడెంట్ మసూద్ అలీ, ఉపాధ్యక్షులు గురుదేవి, రమణారెడ్డి, కె పాండురంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.